# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## ట్రాక్టర్-స్కూల్ బస్సు ఢీ


- ఇద్దరు చిన్నారులు మృతి, పలువురికి గాయాలు

**బలగం టీవీ, వరంగల్**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్, స్కూల్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వరంగల్ శంభునిపేటకు చెందిన ఓ కుటుంబం ట్రాక్టర్‌పై అన్నారం పరిఫ్ దర్గాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా, మార్గమధ్యంలో శ్రీనగర్ క్రాస్‌రోడ్డు వద్ద పాఠశాల నుంచి వస్తున్న స్కూల్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న చిన్నారితో పాటు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. మరోవైపు స్కూల్ బస్సు డ్రైవర్‌తో పాటు ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సాయం

- 175 మిలియన్ డాలర్ల అభివృద్ధి సహాయం ప్రకటించిన భారత్
- మోదీ-హెర్మినీ భేటీతో ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దశ



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

సెషెల్స్‌కు భారత్ 175 మిలియన్ డాలర్ల అభివృద్ధి సహాయ ప్యాకేజీని ప్రకటించింది. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ, సెషెల్స్ అధ్యక్షుడు ప్యాట్రిక్ హెర్మినీతో విస్తృత స్థాయి చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో రెండు దేశాల మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించేందుకు సంయుక్త దృష్టికోణాన్ని వెల్లడించారు.మోదీ--హెర్మినీ సమావేశం అనంతరం డిజిటల్ పరిష్కారాలు, ఎగుమతులు, డేటా షేరింగ్, సముద్ర శాస్త్రీయ పరిశోధన వంటి అంశాలపై మొత్తం ఏడు ఒప్పందాలు కుదిరినట్లు పీటీఐ వెల్లడించింది.

**'మహాసాగర్' దృష్టిలో సెషెల్స్‌కు కీలక స్థానం**

భారత్ 'మహాసాగర్' విజన్‌లో సెషెల్స్ కీలక భాగస్వామిగా ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "ఈ రోజు జరిగిన చర్చలతో భారత్--సెషెల్స్ భాగస్వామ్యం కొత్త దశలోకి అడుగుపెడుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. ఆరు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన హెర్మినీతో జరిగిన చర్చల్లో సుస్థిరత, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, భద్రత వంటి రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయి.

"భారత్, సెషెల్స్ సంబంధం కేవలం దౌత్య సంబంధాలకు మాత్రమే పరిమితం కాదు. శతాబ్దాలుగా భారత మహాసముద్రం అలలు మన ప్రజలను కలుపుతున్నాయి" అని మోదీ మీడియా ప్రకటనలో తెలిపారు. వాణిజ్యం, సంస్కృతి, పరస్పర విశ్వాసం కాలక్రమేణా మరింత బలపడినట్లు పేర్కొన్నారు.

**బ్లూ ఎకానమీకి భారత మద్దతు**

సెషెల్స్ బ్లూ ఎకానమీ ప్రణాళికలకు మద్దతుగా హైడ్రోగ్రఫీ రంగంలో సహకారం పెంచాలని ఇరు దేశాల నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో భారత సహకారంతో సెషెల్స్ హైడ్రోగ్రాఫిక్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. భారత్--సెషెల్స్ సంబంధాల్లో అభివృద్ధి సహకారం కీలక స్థంభమని మోదీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 175 మిలియన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఇందులో 125 మిలియన్ డాలర్లను రూపాయి ఆధారిత లైన్ ఆఫ్ క్రెడిట్‌గా 50 మిలియన్ డాలర్లను గ్రాంట్ సహాయంగా అందజేస్తారు.

ఈ నిధులు సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సంరక్షణ, రక్షణ, సముద్ర భద్రత రంగాలకు వినియోగించనున్నారు. అదనంగా 1,000 మెట్రిక్ టన్నుల ధాన్యాలు, పప్పుదినుసులు కూడా అందజేస్తామని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ తెలిపారు.

**ఆరోగ్యం, ఇంధనం, రక్షణలో సహకారం**

సరసమైన నాణ్యమైన ఔషధాల సరఫరా, ఆరోగ్య మౌలిక సదుపాయాల బలోపేతంలో భారత్ సహకారం కొనసాగిస్తుందని మోదీ తెలిపారు. పునరుత్పాదక ఇంధనం, వాతావరణ మార్పులకు అనుగుణ పరిష్కారాల్లోనూ సహకారం పెంచుతామన్నారు. సముద్ర పరిశోధన, సామర్థ్య వృద్ధి, డేటా షేరింగ్‌లో భారత నైపుణ్యాన్ని సెషెల్స్‌తో పంచుకుంటామని చెప్పారు. రక్షణ సహకారం, సముద్ర భద్రత ద్వైపాక్షిక సంబంధాల్లో ముఖ్యమైన అంశాలని పేర్కొంటూ, కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో సెషెల్స్ పూర్తి సభ్యత్వాన్ని స్వాగతిస్తున్నామని మోదీ తెలిపారు.ఇది భారత మహాసముద్ర ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని మరింత బలపరుస్తుందని ప్రధాని స్పష్టం చేశారు.

## ఇంకెంతకాలం మత విద్వేషాలతో రాజకీయాలు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్రం సహకరించలేదు
- కేంద్ర సహకారం లేకుండానే ప్రభాకర్‌రావును రప్పించాము
- సుప్రీంకోర్టు ఆదేశాలతో వేగవంతమైన విచారణ
- జనగణన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన
- మహిళల రిజర్వేషన్‌తో జమిలీ ఎన్నికలు
- కవిత వ్యవహారంతో నాకు సంబంధం లేదు
- 2029లోనే అసెంబ్లీ--పార్లమెంట్ ఎన్నికలు
- దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర వివక్ష ఆరోపణలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇంకెంతకాలం మత విద్వేషాలతో రాజకీయాలు చేస్తారని బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. . మీడియాతో ఇష్టాగోష్టిగా సీఎం మాట్లాడారు. గల్లీ స్థాయి ఎన్నికలకు ప్రధాని నరేంద్ర మోదీకి ఏమాత్రం సంబంధం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో మోదీ ముఖచిత్రం చూసి ఓటేస్తే, మోరిని తీయడానికి మోదీ వచ్చి చేస్తారా? అని సెటైర్ వేశారు.బీజేపీ నేతలు రాముడి పేరు చెబుతుంటారని, కానీ రోజా దండం పెట్టుకునేది మాత్రం అసదుద్దీన్ ఒవైసీకేనని విమర్శించారు. బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని, ఆయన పేరు లేకుండా బీజేపీ రాజకీయాలు సాగవని ఎద్దేవా చేశారు. రాముడి పేరును ఎంతసార్లు పలుకుతున్నారో, ఒవైసీ పేరును ఎంతసార్లు జపిస్తున్నారో ప్రజలే గమనించాలని వ్యాఖ్యానించారు. ప్రతిసారి అసదుద్దీన్ ఒవైసీని 'అల్లావుద్దీన్ అద్భుత దీపం'లా చూపించి ఓట్లు అడుగుతున్నారని ధ్వజమెత్తారు. 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ అసదుద్దీన్ ఒవైసీని ఎందుకు నియంత్రించలేకపోయిందని ప్రశ్నించిన సీఎం, ఇంకెంతకాలం మత విద్వేషాలతో రాజకీయాలు చేస్తారని మండిపడ్డారు.

గత పదేళ్లుగా సర్పంచ్ నుంచి పార్లమెంట్ వరకు అధికారంలో ఉన్నది బీఆర్ఎస్‌నేనని, మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలకు వారే కారణమని ఆరోపించారు. బెదిరింపులతో అందరినీ పార్టీలో చేర్చుకున్నారని, అలాంటి పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదన్నారు. "పదేళ్లుగా అధికారంలో ఉండి రూ.20 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్నారు.. మరి ప్రజలకు చేసింది ఏమిటి? బీఆర్ఎస్‌లో ఒక్కరో ఇద్దరో గెలిచినా మున్సిపాలిటీలకు ఉపయోగం ఉంటుందా?" అని ప్రశ్నించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు అహంకారంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.కేంద్రంలోని బీజేపీకి 2022 వరకు బీఆర్ఎస్ అన్ని విషయాల్లో సహకరించిందని, మోదీ తెచ్చిన ప్రతి చట్టానికి మద్దతిచ్చిందని గుర్తు చేశారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని చెప్పారని, మరి ఇప్పుడు ఏమైంది? అని ప్రశ్నించారు. ఫార్ములా కేసులో కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించట్లేదని నిలదీశారు.

"ఈరోజు రాష్ట్రంలో ఉన్న సమస్యలన్నింటికీ బీఆర్ఎస్‌నే కారణం. బీఆర్ఎస్‌ను యాసిడ్ పోసి కడగాలి" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం రెండేళ్లుగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఒకటో తేదీన జీతాలు ఇస్తోందని, ఆరోగ్యశ్రీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, వ్యవసాయానికి రూ.1.15 లక్షల కోట్ల ఖర్చు, రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును భారత్‌కు రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సీఎం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే 20 నెలలుగా విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావును భారత్‌కు తీసుకొచ్చామని తెలిపారు. ఆయన రాకతో విచారణ వేగం పెరిగిందని వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరమే జమిలీ ఎన్నికలు జరుగుతాయని, అందులో మహిళల రిజర్వేషన్ కూడా అమలులోకి వస్తుందని సీఎం చెప్పారు. జనగణన తర్వాతే డీలిమిటేషన్ ఉంటుందని, జనాభా ప్రాతిపదికన జరిగే పునర్విభజన వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ లేదని స్పష్టం చేశారు.

**కవిత అంశంతో నాకు సంబంధం లేదు**

కవిత జైలుకు వెళ్తే సీఎం అవుతారన్న ఉద్దేశంతో కేటీఆర్, హరీశ్ రావు పోటీ పడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. కవిత వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆడబిడ్డలను సరిగా చూసుకుంటే ఇలాంటి సమస్యలు రావని వ్యాఖ్యానించారు. గతంలో ఏపీ, మహారాష్ట్ర, బిహార్‌లలో కూడా సోదరులపై సోదరిలు చర్యలు తీసుకున్నారని, వాటి వెనక కూడా తానే ఉన్నానా? అని ప్రశ్నించారు. అధికారం ఉన్నప్పుడు అందరూ కలిసి ఉన్నారని, అధికారం పోయిన తర్వాత గొడవలు వస్తున్నాయన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు కేంద్రం అంగీకరించకపోతే రాష్ట్రం విచారణ చేస్తుందని చెప్పారని, కానీ ఇప్పటివరకు ఎటూ తేల్చడం లేదని సీఎం ఆక్షేపించారు. వారి అంతర్గత విభేదాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలను కలిపి అధికారంలోకి వచ్చామని అన్నారు.

**2029లోనే జమిలీ ఎన్నికలు**


తిరుమల లడ్డూ వ్యవహారం పక్క రాష్ట్రానికి చెందిన అంశమని సీఎం కొట్టిపారేశారు. తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల్లో విజయ డెయిరీ నెయ్యినే వినియోగించాలని నిర్ణయించామని తెలిపారు. కొన్ని జిల్లాలను రద్దు చేస్తారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. జనగణన ప్రక్రియలో భాగంగా వచ్చే ఏడాది మార్చి వరకు జిల్లాల సరిహద్దులు మార్చే అవకాశమే లేదన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2028లో కాకుండా 2029లోనే జమిలీ విధానంలో జరుగుతాయని అభిప్రాయపడ్డారు.

**దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర వివక్ష**

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జనగణన, కులగణన, నియోజకవర్గాల పెంపు, పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు, జమిలీ ఎన్నికల అంశాలు కీలకంగా మారతాయని సీఎం తెలిపారు. భాష అంశంపై స్పందిస్తూ, సందర్భానుసారంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే కేవలం 42 పైసలే తిరిగి వస్తున్నాయని, యూపీకి రూపాయికి రెండు రూపాయలు, బిహార్‌కు ఆరు రూపాయలు వస్తున్నాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

- రేపే 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లో ఎన్నికలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు
- 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- మొదలైన తాయిలాల పర్వం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు సంబంధించిన ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు కీలక పరీక్షగా మారాయి. మూడు ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.కాంగ్రెస్ తరఫున ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రచార బాధ్యతలు చేపట్టగా, బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ రంగంలోకి దిగారు. బీఆర్ఎస్ నుంచి కేటీఆర్ (కే.టి. రామారావు), టి. హరీశ్ రావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

బీజేపీ ప్రచారంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా పాల్గొన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న పట్టణాల్లో ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించారు.

ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలు రహస్యంగా కలిసి కాంగ్రెస్‌ను ఓడించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలకు నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మున్సిపల్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్లు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

మరోవైపు, ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పట్టణాభివృద్ధి కోసం తమకే ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్, రాష్ట్ర రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని మరింత బలపరచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీజేపీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని భావిస్తోంది. 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలిన బీఆర్ఎస్, ఈ మున్సిపల్ ఎన్నికల ద్వారా తిరిగి పుంజుకోవాలని ఆశిస్తోంది. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుండగా, ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న చేపట్టనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయ భవిష్యత్ దిశను సూచించనున్నాయి.

## ఆ పుస్తకం భయమే మోడీని లోక్‌సభకు రానివ్వలేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలపై భయంతోనే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు రాలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పటికీ ప్రధాని భయంలోనే ఉన్నారని, నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఆయనకు లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సాహసం చేసి ప్రధాని సభకు రావాల్సిందని రాహుల్ హితవు పలికారు.సోమవారం మధ్యాహ్నం పలువురు విపక్ష నేతలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో ప్రధాని మోదీపై దాడి చేసేందుకు విపక్ష ఎంపీలు ప్లాన్ చేశారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అలా నిజంగానే ప్లాన్ జరిగి ఉంటే, సంబంధిత ఎంపీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాల్సిందని ప్రశ్నించారు. స్పీకర్ ఆరోపణల్లో నిజం లేకపోవడమే అలాంటి చర్యలు తీసుకోలేదని రాహుల్ అన్నారు.

**'నన్ను మాట్లాడనివ్వడం లేదు'**

మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం అంశాలపై మాట్లాడకుండా మోదీ సర్కారు తనను అడ్డుకుంటోందని రాహుల్ ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ అంశాలపై లోక్‌సభలో మాట్లాడే అవకాశం ఇవ్వబోమని ప్రభుత్వం తేల్చి చెబుతోందన్నారు. సభా కార్యకలాపాలు నిలిచిపోయినా సరే, తనను మాట్లాడనివ్వడం లేదని విమర్శించారు. ఈ అంశంపై మూడు, నాలుగుసార్లు మాట్లాడేందుకు ప్రయత్నించినా అడ్డుకున్నారని తెలిపారు. స్పీకర్ ఓం బిర్లా అన్యాయంగా విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని రాహుల్ మండిపడ్డారు.

"నేను నరవణె పుస్తకం గురించి మాట్లాడలేదు. ఒక మ్యాగజైన్‌లో ప్రచురితమైన అంశాలను మాత్రమే ఉటంకించాను. పుస్తకం గురించి మాట్లాడుతున్నానని ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు సరికావు. నరవణె పుస్తకం ప్రచురితం కాలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పడం తప్పు. ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమైంది. మేం ఒక కాపీ కూడా సేకరించాం. అందుకే ఇది చాలా కీలక అంశం" అని రాహుల్ తెలిపారు.

రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో లోక్‌సభ విపక్ష నేతగా ఉన్న తనను, మొత్తం విపక్షాన్ని మాట్లాడకుండా అడ్డుకుంటున్నారని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార ఎన్డీఏ కూటమి ఎంపీలు పుస్తకాలు ఉటంకిస్తూ,

మిగితా 4వ పేజీలో

## 'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు కారు గుర్తుకు ఓటేయాలి'

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, భూపాలపల్లి**

భూపాలపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

'బూతుల సీఎం రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలంటే ఎల్లుండి పోలింగ్ బూత్‌కు వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి' అంటూ కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిదా రులు మాత్రమే ఆ పార్టీకి ఓటు వేయాలని, మిగిలిన వారంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కేటీఆర్ సూచించారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు అందరికీ అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటతీరు అత్యంత నీచంగా ఉందని, అడ్డగోలుగా మాట్లాడే సీఎం చరిత్రలో ఎవరూ లేరని కేటీఆర్ విమర్శిం చారు. రాష్ట్రాన్ని పాలించడంలో విఫలమై, మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన సకల జనుల సమ్మె సందర్భంగా రేవంత్ రెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి లక్కీ డ్రాలో సీఎం అయిన వ్యక్తి అని, అధికారం వచ్చినప్పటికీ పరిపాలనపై దృష్టి పెట్టకుండా అడ్డగోలు వ్యాఖ్యలతో సమయం వృథా చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఆయన మాటల వల్ల కొంతమంది పోలీసు అధికారులు ప్రతిపక్షాలు, ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని హెచ్చరిస్తూ, అక్రమాలు చేసే పోలీసు అధికారులను వదిలిపెట్టమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణికి చేసిన మేలు ఏమీ లేదని, పైగా ముఖ్యమంత్రి తన బావమరిదితో కలిసి సుమారు రూ.6,000 కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థ గత రెండు సంవత్సరాల్లో నష్టాల్లోకి వెళ్లిందన్నారు. సింగరేణి బొగ్గు గనుల స్కామ్‌కు సంబంధించిన ఆధారాలను

మిగితా 4వ పేజీలో

## 16 నుంచి బడ్జెట్ సన్నాహక సమావేశాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బడ్జెట్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సన్నాహక సమావేశాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం సమావేశాల సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. గతేడాది డిసెంబర్ 23 నుంచి ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో శాఖల వారీగా ఆన్‌లైన్‌లో బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇప్పుడు భౌతికంగా ఈనెల 16 నుంచి శాఖల వారీగా ఆర్థిక శాఖ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ సమావేశాలు సచివాలయంలో జరుగుతాయి. ఆయా శాఖల మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు, ఆయా శాఖల విభాగాధిపతులతో ఈనెల 23 వరకు ఈ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 16న మొదటి సమావేశం ఉదయం ఎస్సీ,ఎస్టీ, వికలాంగుల సంక్షేమం, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో మధ్యాహ్నం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో, సాయంత్రం మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి అజహరుద్దీన్‌తో ఉంటుంది. అదేనెల 17న ఉయదం వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో, మధ్యాహ్నం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి అనసూయ సీతక్కతో, సాయంత్రం ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సమావేశం ఉంటుంది. 18న ఉదయం రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో, మధ్యాహ్నం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో, సాయంత్రం పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సమావేశవ యుంటుంది. 19న ఉదయం ఎక్సైజ్, పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో, మధ్యా హ్నం కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో, సాయంత్రం పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో సమావేశం ఉంటుంది. 20న ఉదయం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో, మధ్యాహ్నం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈనెల 21న ఉదయం విద్యారంగం, మధ్యాహ్నం హోం శాఖ, సాయంత్రం న్యాయ శాఖతోపాటు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమావేశముంటుంది. 23న మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, మధ్యాహ్నం సాధారణ పరిపాలన శాఖతోపాటు సాయంత్రం ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారు.

## రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

- పోలింగ్ బూత్‌లో రేవంత్‌కు బుద్ధి చెప్పాలి : బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్‌రావు



**బలగం టీవీ, దుబ్బాక**

రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్కటైనా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారని గొప్పలు చెప్పుకుంటున్నా, రేవంత్ రెడ్డి పాలన అంతా తుస్సేనని ఎద్దేవా చేశారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో పర్యటించిన హరీశ్‌రావు, చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తెలంగాణను సాధించిన కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ చేసిన తప్పా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని, ప్రజలకు పథకాలు అమలు చేస్తేనే ఓట్లు వస్తాయని హితవు పలికారు. బూతులు మాట్లాడే రేవంత్ రెడ్డికి పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్ల మీద ఒట్లు పెట్టిన రేవంత్ రెడ్డి మాట తప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ హామీ అమలు చేయకపోవడమే కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు వ్యాఖ్యానిం చారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న సీఎం మెదక్‌కు మాత్రం రావడం లేదని, ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడనే భయంతోనే ముఖం చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని భయపడి ఇటువైపు చూడడం లేదన్నారు. మెదక్ జిల్లాలో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని జోస్యం చెప్పారు.

**జాబ్ క్యాలెండర్ లేదు.. స్కామ్ క్యాలెండర్ ఉంది**

రేవంత్ రెడ్డికి జాబ్ క్యాలెండర్ లేదని, స్కామ్ క్యాలెండర్ మాత్రం ఇచ్చారని హరీశ్‌రావు

## సీఎం రేవంత్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసిన సభల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేసి ఎన్నికల కోడ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉల్లంఘించారని బీఆర్ఎస్ విమర్శించింది. ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్ రెడ్డి, బొమ్మెర రామమూర్తి, కురువ విజయ్ కుమార్, కార్తీక్ రాయల, ఫయాజ్ కలిసి ఫిర్యాదు చేశారు. వికారాబాద్‌లో జరిగిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తీవ్రంగా ఉల్లంఘించి, ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించారనీ, తక్షణమే రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కురువ విజయ్ కుమార్ మాట్లాడుతూ 'ప్రజా పాలన-ప్రగతి బాట'అనే పేరుతో జరిగిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో, బ్యాంక్ లింకేజ్ కింద చెక్కుల పంపిణీ 6,650 మహిళా స్వయం సహాయక గ్రూపులకు స్త్రీ నిధి సహాయం చేశారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఓటర్లను ప్రభావితం చేశారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారని గుర్తు చేశారు.

## అంగన్‌వాడీల పర్యవేక్షణ బాధ్యతలు సర్పంచ్‌లకే

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్‌లే నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం పేర్కొంది.గత రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పినట్లు ప్రభుత్వం గుర్తించింది. అనేక చోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు నివేదికలు రావడంతో, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో తాజా నిర్ణయం తీసుకుంది. ఇటీవలే కొలువుదీరిన కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, మొత్తం 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, ఏఎన్ఎం, పాఠశాల సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు సభ్యులుగా ఉండనున్నారు.పౌష్టికాహార సరఫరాపై నెలవారీ తనిఖీలుకమిటీ ప్రతి నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న బియ్యం, పప్పు, బాలామృతం, గుడ్లు, పాలు వంటి పోషకాహార పదార్థాల నాణ్యతను, పంపిణీ విధానాన్ని తనిఖీ చేయనుంది.

# పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే

- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో ముందు రోజు(ఈ నెల 10 వ తేదీన మంగళ వారం) అలాగే పోలింగ్ రోజున (ఈ నెల 11 వ తేదీన బుధవారం) సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యా సంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోలింగ్ రోజున ఈ నెల 11వ తేదీన సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.



# డబుల్ బెడ్ రూంలు పూర్తి చేయాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో సమీక్ష**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూంలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

వేములవాడ, కొండాపూర్, మద్దికుంట, బద్దెనపల్లి, తంగళ్ళపల్లిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా వాటిపై సమీక్షించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. ఆయా ఇండ్ల పనులను గృహ నిర్మాణ శాఖ ఆద్వర్యంలో చేపట్టి ..త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సాజిద్, ఆర్ అండ్ బి ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. సిరిసిల్ల పట్టణం గీతానగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సోమవారం ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాలెంటైన్స్ డే సందర్భంగా ఐఫోన్ ప్రేమికులకు శుభవార్త

- **అమెజాన్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై భారీ ఆఫర్లు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌పై అమెజాన్ ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. ప్రస్తుతం అమెజాన్‌లో ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ 256 జీబీ మోడల్ ధర రూ.1,49,900గా ఉంది. అయితే పలు ఆఫర్లను వినియోగించుకుంటే ఈ ఫోన్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంది. అమెజాన్ ప్రైమ్ మెంబర్లు అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేస్తే సుమారు రూ.7,495 వరకు క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఈ మొత్తం తక్షణ తగ్గింపుగా కాకుండా అమెజాన్ పే బ్యాలెన్స్‌లో జమ అవుతుంది. క్యాష్‌బ్యాక్ మొత్తం వినియోగదారుడి కార్డు, లావాదేవీలపై ఆధారపడి మారవచ్చని అమెజాన్ స్పష్టం చేసింది.

అమెజాన్‌లో పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేస్తే గరిష్ఠంగా రూ.48,000 వరకు తగ్గింపు పొందవచ్చు. మంచి స్థితిలో ఉన్న ఐఫోన్ 15 మోడల్‌ను ఎక్స్ఛేంజ్ చేస్తే సుమారు రూ.32,150 వరకు విలువ లభించే అవకాశం ఉందని సమాచారం.

# వేములవాడ అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం..

- **రెండేళ్లలో 1000 కోట్ల నిధులతో వేములవాడ ఘన అభివృద్ధి**
- **గత పాలకుల హయాంలో ఏమీ జరగలేదు**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఇచ్చిన హామీలకు కట్టుబడి, పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ప్రచారంలో భాగంగా సోమవారం వేములవాడ పట్టణంలోని పలు వార్డుల్లోలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేములవాడ పట్టణనికి చేసింది ఏమీ లేదని, బస్మాసుర ప్రమాణాలు చేసి మన తలపైనే అభివృద్ధి పేరుతో అప్పుల భారం మోపారని అన్నారు.

వేములవాడ పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వేముల వాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే 150 కోట్ల రూపా యలు మంజూరు చేశామని,పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే పట్టణంలో సుమారు 47 కోట్ల రూపా యలతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టామని, ఇది గత 50 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కీలకమైన అభివృద్ధి అని అన్నారు.

పట్టణ సుందరీకరణలో భాగంగా మల్లారం జంక్షన్ నుండి బతుకమ్మ తెప్ప, బ్రిడ్జి మీదుగా జగిత్యాల బస్ స్టాండ్ (సాయి రక్ష) వరకు మొత్తం 3.6 కిలోమీటర్ల పరిధిలో 146 పోల్స్‌తో సుందరీకరణ పనులకు సుమారు 2 కోట్ల 65 లక్షల రూపాయలు తో పనులు



చేస్తున్నామని అన్నారు. జంక్షన్ల అభివృద్ధి కోసం తిప్పాపూర్ జంక్షన్ వద్ద 1 కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని,మున్సిపల్ శాఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదలవుతున్నాయన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, అదనంగా మరిన్ని ప్రాంతాల్లో పనుల కోసం 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేయించామని అన్నారు. పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా టూరిజం శాఖ ద్వారా గుడి చెరువులో బోటింగ్ సౌకర్యానికి 1 కోటి 40 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని, దసరా పండుగ సందర్భంగా జమ్మి చెట్టు వద్ద నడకకు ఇబ్బందులు లేకుండా 35 లక్షల రూపాయలతో పనులు చేపట్టినామని అన్నారు.

వేములవాడ పట్టణంలో గంగపుత్రులు,గంగమ్మ తల్లి భక్తులు 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్న బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని, బ్రిడ్జి నిర్మాణం చేయడం ద్వారా భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గత 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాదీఖానా నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరు అయ్యాయని,ఒకవేళ ఈ నిధులు సరిపోకపోతే అదనపు నిధులు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గత పాలకులు కేవలం ప్రొసీడింగ్స్ ఇచ్చి పనులు చేయకుండా కాలయాపన చేశారని,.తమ ప్రభుత్వం మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.గత రెండు సంవత్సరాల కాలంలోనే వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చామని, ఇది చరిత్రాత్మకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేస్తుందని,గత ప్రభుత్వం చేయని అభివృద్ధి రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఇది చూసి ఓర్వలేకనే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీ పైన అసత్యపు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని అన్నారు..

**కేటీఆర్ అసత్యపు ఆరోపణలు మానుకోవాలి..**

కేటీఆర్ వేములవాడ వచ్చి నోటికి వచ్చిన మాటలు మాట్లాడారని నోరు అదుపులో పెట్టుకోవాలని .అన్నారు.గతంలో కెసిఆర్ ఏటా రాజన్న ఆలయానికి 100 కోట్లు ఇస్తానని మోసం చేస్తే ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 150 కోట్లు కేటాయించి రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగేలా చూస్తున్నారని,రానున్న 1000 సంవత్సరాల పాటు ఉండేలా ఆలయ అభివృద్ధి చేస్తున్నమని అన్నారు.కేటీఆర్ మొన్నటి రోజున వచ్చి పాల్గొన్న మూడు మీటింగ్ ల పక్కకు చూస్తే మేము చేసిన అభివృద్ధి కనిపిస్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నామన్నారు. పేదవారు ఎమ్మెల్యే గా గెలిస్తే కేటీఆర్ చూస్తూ ఓర్వలేకపోతున్నారు, మీ కేసిఆర్ ఇచ్చిన మాట తప్పినందుకు వేములవాడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. గతంలో వేములవాడ మున్సిపల్‌ను బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చారని, అలాగే బీజేపీకి అవకాశం ఇచ్చినప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తుచేసుకోవాలన్నారు.

ప్రస్తుతం తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పరిపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కావడంతో, వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ చేతుల్లో ఉంటే మరిన్ని నిధులు, మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గతంలో బిఆర్ఎస్, బీజేపీ పాలనలతో పోల్చి, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు.కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తేనే వేములవాడ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.

## పోలింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది మూడో విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ సోమవారం నిర్వహించారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, నోడల్ అధికారి భారతి, ఈడీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అవగాహన పెంపొందించాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**
- **ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆద్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారం సంద ర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సభ్యుల సమక్షంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జనాభాలోని వివిధ వర్గాలలో ఆర్థిక అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారాన్ని అమలు చేస్తుందని వివరిం చారు. ఈ నెల 09 వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కేవైసీ -- సురక్షిత బ్యాంకింగ్‌కు మీ మొదటి అడుగు అనే థీమ్‌తో పాటించాలని ప్రతిపాదించారని తెలిపారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ), సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీ (సీకేవైసీ,కేవైసీ సంబంధిత మోసాలు మనీ మ్యూలింగ్‌కు వ్యతిరేకంగా జాగ్రత్తలతో సహా, ఖాతా క్రమశిక్షణను పాటించడం,



ప్రజలలో అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సమన్వయంతో జిల్లాస్థాయిలో అనేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆర్బీఐ, బ్యాంకులు ఎప్పుడూ మెయిల్‌లు, ఎస్ఎంఎస్ లు పంపదు లేదా బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని అడిగే కాల్‌లు చేయదని స్పష్టం చేశారు. వివిధ సోషల్ మీడియాల ద్వారా మొబైల్ ఫోన్లకు వచ్చే ఆఫర్లు, లింకులు, ఫోన్లకు స్పందించ వద్దని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# వార్ వన్ సైడ్... విక్టరీ డిసైడ్..!

- 20వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి స్వరుణ్ ప్రభంజనం

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని 20వ వార్డులో ఎన్నికల సమరం ఏకపక్షంగా మారుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన యువ నేత పెంట స్వరుణ్ కుమార్ కు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న మద్దతుతో గెలుపు దిశ స్పష్టంగా కనిపిస్తోంది. వార్డు వ్యాప్తంగా సాగుతున్న ప్రచారంలో స్వరుణ్ కు లభిస్తున్న స్పందన ప్రత్యర్థుల గుండెల్లో ఓటమి భయాన్ని నింపుతోంది. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆశీర్వాదంతో రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టిన పెంట స్వరుణ్ తన వ్యక్తిత్వం,ప్రజలకు దగ్గరగా ఉండే స్వభావం,సమస్యలపై స్పష్టమైన అవగాహనతో ఓటర్ల మనసు గెలుచుకుంటున్నారు.ఇంటింటి ప్రచారం, కాలనీ సమావేశాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని స్వరుణ్ కు నీరాజనాలు పలుకుతూ తమ మద్దతును ప్రకటిస్తున్నారు. ప్రస్తుతం వార్డు అంతటా వినిపిస్తున్న ఒకే ఒక్క మాట ---"స్వరుణ్ స్వరుణ్..."యువత మాత్రమే కాకుండా మహిళలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు స్వరుణ్ కుమార్ వైపు మొగ్గు చూపుతున్నారు. మంచి విద్యావంతుడిగా గుర్తింపు పొందిన స్వరుణ్ అభివృద్ధి,పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే తన లక్ష్యమని ప్రచారంలో స్పష్టంగా చెబుతున్నారు. ఆయన మాటల్లో నిజాయితీ,ఆలోచనల్లో స్పష్టత ఉండటంతో ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతోంది. ప్రచారంలో ఆకట్టుకునే శైలితో ముందుకు సాగుతున్న పెంట స్వరూన్ 20వ వార్డు అభివృద్ధికి స్పష్టమైన విజన్‌తో ప్రజల ఆశల ప్రతినిధిగా మారుతున్నారు.ఈ నేపథ్యంలో భారీ మెజారిటీతో ఆయన విజయం సాధించడం ఖాయమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా



వ్యక్తమవుతోంది. ఒక వైపు ప్రత్యర్థులు తమదే గెలుపు అంటూ విర్రవిగుతుండగా స్వరుణ్ మాత్రం చాప కింద నీరులా తన ప్రచారాన్ని విజయం వైపు సాగిస్తున్నారు. 20వ వార్డులో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి పెంట స్వరుణ్ కుమార్ సిద్ధంగా ఉండగా ప్రజలు కూడా మార్పుకు సిద్ధమయ్యారని పరిస్థితులు స్పష్టంగా చెబుతున్నాయి.

**వేములవాడ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం,**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వేములవాడ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 12, 20, 21, 26, 27 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థుల మద్దతుగా ఆయన ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు.వార్డుల వారీగా ప్రచారం చేసిన అభ్యర్థులు,12వ వార్డు రామతీర్థపు కృష్ణవేణి, 20వ వార్డు పెంట స్వరూన్, 21వ వార్డు కోయల్కార్ మస్తాన్, 26వ వార్డు సిర్రశీ శిరీష, 27వ వార్డు బుట్టి లావణ్య.

ప్రచారంలో భాగంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్ మాటలు ఆయన అహంకారానికి, మూర్ఖత్వానికి నిదర్శనమని విమర్శించారు."వేములవాడ అభివృద్ధిని గాలికి వదిలేసినందుకు కేటీఆర్ ప్రజలకు క్షమాపణలు చెబుతారని ఆశించాం. కానీ, పచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు."గత పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన మూడవ బ్రిడ్జి పనులకు రూ. 12 కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించాం. కేటీఆర్ మీటింగ్ పెట్టిన స్థలం వద్దే 80 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు కనిపిస్తున్నా ఆయనకు కళ్లు కనబడడం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఆలయ అభివృద్ధి కోసం ఒక్క ఇటుక కూడా పేర్చలేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం రూ. 1000 కోట్లతో వేములవాడను అభివృద్ధి చేస్తోందని స్పష్టం చేశారు.



## బండి సంజయ్, గంగుల తీరుతో కరీంనగర్ అవినీతిమయం

- మంత్రి పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, కరీంనగర్**

కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి రాజకీయ తీరుతో కరీంనగర్ జిల్లా అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంతో రూ.100 కోట్ల డీల్ చేసుకుందంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య అంతర్గత అవగాహన ఉందని, ఆ ఒప్పందం ప్రకారమే అభ్యర్థుల ఎంపిక జరిగిందని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల డేగ కన్ను

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సిరిసిల్ల డీఎస్పీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకమైన వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో భద్రతను కట్టుదిట్టం చేశామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని డీఎస్పీ పేర్కొన్నారు. చెక్‌పోస్టులు, వీడియో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నాం. అక్రమ మద్యం, డబ్బు పంపిణీ వంటి ప్రలోభాలను అడ్డుకోవడానికి ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తున్నాయి. ఓటర్లను బెదిరించినా లేదా ప్రలోభాలకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. "ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలి." అని డీఎస్పీ నాగేంద్రచారి విజ్ఞప్తి చేశారు.



## ప్రజల దాహం తీర్చేందుకే ముందస్తు మరమ్మతులు..

- మండేపల్లి గ్రామంలో బోరు రిపేర్ చేయించిన సర్పంచ్ గాధగోని సాగర్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

మండేపల్లి గ్రామంలోని న్యూ ఎస్సీ కాలనీ అంగన్వాడీ సెంటర్ సమీపంలో ఉన్న చేతిబోరుకు సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, కాలనీ ప్రజలకు మంచినీటి ఎద్దడి కలగకుండా ఉండేందుకు సర్పంచ్ గాధగోని సాగర్ ఈ చర్యలు చేపట్టారు.


ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎండలు ముదిరే లోపే గ్రామంలోని నీటి వనరులను పునరుద్ధరిస్తున్నామని, ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలకు, స్థానిక ప్రజలకు ఈ బోరు మరమ్మతుతో నీటి సౌకర్యం మెరుగుపడనుంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాధగోని సాగర్ తో పాటు యాస మధు, గ్రామ కరోబార్ లచ్చిరెడ్డి మరియు స్థానికులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.సోమవారం రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి,



అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## వేములవాడలో జనసేన పార్టీ విస్తృత ప్రచారం

**16వ వార్డు అభ్యర్థిగా కొలగాని చందు...**

**బలగం టీవీ, వేములవాడ :**

వేములవాడ పట్టణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జనసేన పార్టీ తన ప్రచార పర్వంలో వేగాన్ని పెంచి ప్రత్యర్థులకు గట్టి పోటీనిస్తోంది. ముఖ్యంగా పట్టణంలోని 16వ వార్డు నుంచి జనసేన అభ్యర్థిగా కొలగాని చందు బరిలోకి దిగడంతో వార్డులో ఎన్నికల సందడి నెలకొంది. రాజన్న సిరిసిల్ల జిల్లా మరియు వేములవాడ పట్టణ జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వార్డు అంతటా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, జనసేన సిద్ధాంతాలను వివరిస్తున్నారు. కాలనీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వార్డులో పేరుకుపోయిన పారిశుధ్యం, మౌలిక వసతులు, త్రాగునీరు మరియు రోడ్ల సమస్యలను ప్రజల ముందుకు తీసుకువస్తున్నారు.

ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. "ఏళ్ల తరబడి పాలించిన నాయకులు అభివృద్ధిని విస్మరించి ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైంది. రాజకీయాల్లోకి వస్తున్న యువతకు, మార్పును కోరుకునే కొలగాని చందు వంటి అభ్యర్థికి ఒక్క అవకాశం ఇవ్వాలి" అని కోరారు. రాబోయే ఎన్నికల్లో 'గాజు గ్లాస్' గుర్తుకు ఓటు వేసి చందును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ అభ్యర్థి గోపన్నగారి మాధవిలత గడపగడప ప్రచారం..



- అధికారం కోసం కాదు... అభివృద్ధే లక్ష్యం: మాధవి లత

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బలపరిచిన 28వ వార్డు అభ్యర్థి గోపన్నగారి మాధవి లత గడపగడప ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి లత మాట్లాడుతూ.. అధికారం కోసం కాదు అభివృద్ధి లక్ష్యంగానే ప్రజల ముందుకు వచ్చానని అన్నారు. తాను చిన్నప్పటి నుంచి ఇదే 28వ వార్డులో నివసిస్తూ పెరిగానని, ఎన్నో మంది నాయకులు, వార్డు సభ్యులు గెలిచినా ఈ వార్డుకు మాత్రం సరైన అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న గల్లీల్లో మ్యాన్‌హోల్స్‌పై బిళ్ళలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ప్రమాదాలకు గురైన సంఘటనలు నేటికీ కళ్లముందు కనిపిస్తున్నాయని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని 28వ వార్డును అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాను గెలిస్తే 24 గంటలు వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు, రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ప్రజలు తమ ఓటుతో ఎంతో మందిని గెలిపించారని, ఈ ఒక్కసారి గోపన్నగారి మాధవి లతకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని 28వ వార్డు ప్రజలను కోరారు. ఈ గడపగడప ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు విడుదల

- **గ్రేడ్ 'బీ'కి కోహ్లీ, రోహిత్... అగ్రగ్రేడ్‌లో గిల్, బుమ్రా, జడేజా**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బీసీసీఐ 2025--26 సీజన్‌కు సంబంధించిన వార్షిక ఆటగాళ్ల కాంట్రాక్టుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈ జాబితాలో టీమిండియా సీనియర్ స్టార్‌లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను గ్రేడ్ 'బీ'కి తగ్గించడం సంచలనంగా మారింది. మరోవైపు ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అగ్రశ్రేణి గ్రేడ్‌లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.

టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి వైదొలిగి కేవలం వన్డే క్రికెట్‌కే పరిమితమైన నేపథ్యంలో కోహ్లీ, రోహిత్‌లను గ్రేడ్ 'బీ'కి మార్చినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే వేదికగా జరగనున్న ఐసీసీ వన్డే ప్రపంచకప్‌పై వీరిద్దరూ ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

**అగ్రగ్రేడ్‌లో కొనసాగుతున్న గిల్**

గత సీజన్‌లో గ్రేడ్ 'ఏ'కి ప్రమోషన్ పొందిన ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్... ఈసారి కూడా బుమ్రా, జడేజాలతో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. గిల్ నాయకత్వానికి బీసీసీఐ ఇచ్చిన విశ్వాసానికి ఇది నిదర్శనంగా క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**గ్రేడ్ 'బీ'లో 11 మంది**

గ్రేడ్ 'బీ'లో కోహ్లీ, రోహిత్‌లతో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వికెట్‌కీపర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ తదితరులు కలిపి మొత్తం 11 మంది ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు.




## జింబాబ్వే శుభారంభం

- **ఓమన్‌పై 8 వికెట్ల ఘన విజయం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో జింబాబ్వే జట్టు శుభారంభం చేసింది. గ్రూప్--బీ లీగ్ మ్యాచ్‌లో సోమవారం ఓమన్‌తో జరిగిన పోరులో సమష్టిగా రాణించిన జింబాబ్వే 8 వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేసింది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఓమన్ జట్టు 19.5 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌటైంది. ఆరంభంలోనే కెప్టెన్ జతిందర్ సింగ్ (5), హమ్మద్ మిర్జా (0), కరణ్ సోనావలే (0), వాసిమ్ అలీ విఫలమవడంతో ఓమన్ 27 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సుఫ్యాన్ మెహమూద్ (39 బంతుల్లో 2 ఫోర్లు -- 25), వినాయక్ శుక్లా (21 బంతుల్లో 4 ఫోర్లు -- 28)లు ఆరో వికెట్‌కు 42 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో నదీమ్ ఖాన్ (18 బంతుల్లో ఫోర్, సిక్స్ -- 20) కొంత పోరాడడంతో ఓమన్ గౌరవప్రదమైన స్కోర్‌ను చేరుకుంది.జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవ (3/17), బ్లెస్సింగ్ ముజరబాని (3/16), బ్రాడ్ ఎవాన్స్ (3/18) మూడేసి వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. సికందర్ రాజా (1/17) ఒక వికెట్ పడగొట్టాడు.

అనంతరం జింబాబ్వే 13.3 ఓవర్లలోనే 2 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసి విజయం సాధించింది. బ్రియాన్ బెన్నెట్ (36 బంతుల్లో 7 ఫోర్లు -- 48 నాటౌట్) అద్భుతంగా రాణించగా, తడివాన్షే మారుమణి (11 బంతుల్లో 5 ఫోర్లు -- 21) దూకుడుగా ఆడాడు.డియోన్ మేయర్స్ (0) నిరాశపరిచినా, బ్రెండన్ టైలర్ (30 బంతుల్లో 3 ఫోర్లు -- 31, రిటైర్డ్ ఔట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో కెప్టెన్ సికందర్ రాజా (5 నాటౌట్) విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఓమన్ బౌలర్లలో సుఫ్యాన్ మెహమూద్ (2/18) రెండు వికెట్లు తీశాడు.ఈ విజయంతో జింబాబ్వే టోర్నీలో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లనుంది. తదుపరి మ్యాచ్‌లో జింబాబ్వే ఆస్ట్రేలియాతో తలపడనుండగా, ఓమన్ శ్రీలంకతో పోటీపడనుంది.

# దక్షిణాఫ్రికా అదిరే ఆరంభం

- **కెనడాపై 57 పరుగుల ఘన విజయం**

**బలగం టీవీ, అహ్మదాబాద్**




దక్షిణాఫ్రికా పొట్టి ప్రపంచకప్ పదో ఎడిషన్‌లో అదిరే బోణీ కొట్టింది. బ్యాటింగ్‌లో దంచేసిన ప్రొటీస్ జట్టు.. బౌలింగ్‌లో కెనడాను వణికించి 57 పరుగుల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది.ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ ఎడెన్ మార్క్‌రమ్ (54), ట్రిస్టన్ స్టబ్స్ (34 నాటౌట్), డేవిడ్ మిల్లర్ (39 నాటౌట్)ల మెరుపులతో నిర్ణీత 20 ఓవర్లలో 214 పరుగుల భారీ స్కోర్ సాధించింది. చివరి ఓవర్లలో మిల్లర్, స్టబ్స్ జోడీ ధాటిగా ఆడటంతో స్కోర్ పరుగులు పెట్టింది.

లక్ష్య ఛేదనకు దిగిన కెనడా జట్టు ఆరంభంలోనే దెబ్బతింది. పవర్‌ప్లేలో మూడు వికెట్లు కోల్పోయినా.. నవనీత్ ధలివాల్ (64) అర్ధశతకంతో పోరాడగా, హర్ష్ ఠాకెర్ (33) కొంత మేర సహకరించాడు. కానీ, అవసరమైన రన్‌రేటు పెరిగిపోవడంతో భారీ షాట్లకు ప్రయత్నించిన బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరారు.దక్షిణాఫ్రికా పేసర్ లుంగి ఎంగిడి (4/31) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో కెనడా బ్యాటింగ్‌ను కూల్చివేశాడు. మిగతా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కెనడా జట్టు 156 పరుగులకే పరిమితమైంది.

## స్కాట్లాండ్ ఘన విజయం

- **ఇటలీపై 73 పరుగుల భారీ తేడాతో బోణీ**

**బలగం టీవీ, న్యూఢిల్లీ**




ప్రపంచకప్‌లో స్కాట్లాండ్ జట్టు ఘనంగా బోణీ కొట్టింది. ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో 73 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి శుభారంభం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ బ్యాటర్లు ధనాధన్ ఇన్నింగ్స్?తో రెచ్చిపోయారు. ఓపెనర్ జార్జ్ మున్సీ (84 పరుగులు), బ్రెండన్ మెక్?ముల్లెన్ (41 పరుగులు, 18 బంతుల్లోనే), మైకెల్ లీస్క్ (22 పరుగులు, 5 బంతుల్లోనే) రఫ్ఫాడించారు. మిచెల్ జోన్స్ (37 పరుగులు) రాణించాడు. స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. దీంతో టీ20 వరల్డ్‌కప్‌లో 200 ప్లస్ పరుగులు చేసిన తొలి అసోసియేట్ టీమ్ (టెస్టు హోదా లేని జట్టు)గా రికార్డు సృష్టించింది.ఈ క్రమంలోనే యూఎస్‌ఏ (197–3) రికార్డ్‌ను బ్రేక్ చేసింది. 2024లో కెనడాపై యూఎస్‌ఏ 197–3 స్కోర్ చేసింది. ఈ మ్యాచ్‌కు ముందు ఇదే టీ20 వరల్డ్‌కప్‌లో అసోసియేట్ టీమ్ చేసిన అత్యధిక స్కోర్‌గా ఉంది. తాజాగా ఆ రికార్డ్‌ను స్కాట్లాండ్ బ్రేక్ చేసింది.

208 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీ జట్టు 16.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది.లక్ష్య ఛేదనలో తొలి బంతికే ఓపెనర్ జస్టిన్ మోస్కా (0) మైకెల్ లీస్క్ బౌలింగ్‌లో ఔటై ఇటలీకి షాక్ తగిలింది. అయినప్పటికీ బెన్ మానేటి (52) అర్ధ శతకంతో చెలరేగగా, హ్యారీ మానేటి (37), జేజే సమ్స్ (22)లు విలువైన పరుగులు జోడించారు. 12 ఓవర్ల ముగిసే సరికి ఇటలీ 114/3తో బలమైన స్థితిలో నిలిచింది. ఈ దశలో మ్యాచ్‌పై ఇటలీకి ఆశలు కనిపించాయి.అయితే ఆ తర్వాత స్కాట్లాండ్ బౌలర్లు పట్టుబిగించారు. 14వ ఓవర్లో ఒక వికెట్, 15వ ఓవర్లో రెండు, 16వ ఓవర్లో ఒకటి, 17వ ఓవర్లో రెండు వికెట్లు కూల్చుతూ ఇటలీ పతనాన్ని వేగవంతం చేశారు. చివరి 7 వికెట్లను ఇటలీ జట్టు కేవలం 21 పరుగుల వ్యవధిలో కోల్పోయి ఘోర పరాజయాన్ని చవిచూసింది.స్కాట్లాండ్ బౌలింగ్‌లో మైకెల్ లీస్క్ 4 వికెట్లతో హీరోగా నిలవగా, మార్క్ వాట్ 2 వికెట్లు తీశాడు. బ్రాడ్, బ్రాడ్ వీల్, డావిసన్ తలో వికెట్ దక్కించుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ మెరిసిన మైకెల్ లీస్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# ఆ పుస్తకం భయమే మోడీని లోక్‌సభకు రానివ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా స్పీకర్ స్పందించలేదని ఆరోపించారు. అధికార పక్షానికి ఒక న్యాయం, విపక్షానికి మరో న్యాయం ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో సమావేశంలో పలు కీలక అంశాలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్, విపక్ష మహిళా ఎంపీలపై చేసిన వ్యాఖ్యలు, పార్లమెంటుకు సంబంధించిన పలు అంశాలపై సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ సమావేశంలో టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ, డీఎంకే నేత టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. లోక్‌సభ సజావుగా సాగాలంటే సస్పెన్షన్ ఎత్తివేయాలని విపక్షాలు స్పీకర్‌ను కోరాయి. అయితే కొన్ని నిమిషాల్లోనే ఈ సమావేశం ముగిసింది.

సోమవారం మధ్యాహ్నం బడ్జెట్ చర్చ ప్రారంభమైన సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన రాహుల్, స్పీకర్‌తో భేటీలో ఒక ఒప్పందానికి వచ్చామని, బడ్జెట్ చర్చకు ముందు కొన్ని అంశాలపై మాట్లాడే అవకాశం ఇస్తానని స్పీకర్ చెప్పారని తెలిపారు. అయితే అలాంటి అగ్రిమెంట్ ఏమీ జరగలేదని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు స్పష్టం చేశారు. స్పీకర్ సభలో ఉన్నప్పుడే ఈ విషయాన్ని లేవనెత్తాలని రాహుల్‌కు సూచించారు. ఈ క్రమంలో అధికార, విపక్ష ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, గందరగోళం నేపథ్యంలో లోక్‌సభను వాయిదా వేశారు.

# 'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు కారు గుర్తుకు ఓటేయాలి'


(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఇప్పటికే బయటపెట్టినా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గత ఎన్నికల్లో సానుభూతితో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే రెండేళ్లుగా భూపాలపల్లి పట్టణానికి ఏమీ చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణి గడ్డ నుంచే కాంగ్రెస్ పార్టీని తమ హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

## 'గాయపడ్డ సింహం'తో ప్రేక్షకుల ముందుకు తరుణ్ భాస్కర్

- **విడుదలైన ట్రైజర్‌కు మంచి స్పందన**

**బలగం టీవీ, హైదరాబాద్**




నూతన తరహా సినిమాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు' చిత్రంతో న్యూ ఏజ్ కథనాలకు బాటలు వేసిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్‌ను సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా వరుస చిత్రాలతో బిజీగా ఉన్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. ప్రముఖ దర్శకుడు పవన్ సాధినేని ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'గాయపడ్డ సింహం'కు సంబంధించిన టీజర్, ట్రైలర్‌ను కలిపి రూపొందించిన "ట్రైజర్"ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను సమన్వయంగా మేళవించి సరదాగా తెరకెక్కించిన చిత్రంగా ఇది ఉండబోతున్నట్లు ట్రైజర్ చూస్తే అర్థమవుతోంది. కొత్త తరహా కథనాలకు అలవాటుపడ్డ ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.

## 'ఫంకీ' నుంచి కొత్త పాట విడుదల

- **ఆకట్టుకుంటున్న 'నిజమేనా.. నువ్వేనా' సాంగ్**

**బలగం టీవీ, హైదరాబాద్**



మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ ప్రధాన పాత్రలో, కెవి అనుదీప్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫంకీ' నుంచి మరో కొత్త పాట విడుదలైంది. కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదలైన ప్రతి అప్‌డేట్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా, ముఖ్యంగా ఇప్పటివరకు రిలీజైన పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన 'నిజమేనా.. నువ్వేనా' పాట రొమాంటిక్ మూడ్‌లో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు దేవ్ పవార్ లిరిక్స్ అందించగా, సంగీత దర్శకుడు భీమ్స్ రోహిణి గాత్రం అందించారు. మెలోడీతో పాటు భావోద్వేగాలు కలిసిన ఈ పాట సోషల్ మీడియాలో మంచి క్రేజ్ తెచ్చుకుంటోంది. 'ఫంకీ' చిత్రానికి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా శుక్రవారం (ఫిబ్రవరి 13) ప్రేక్షకుల ముందుకు రానుంది.